క్లుప్తంగా

రేపు చంద్రగిరిలో వైకుంఠ ఏకాదశి



ఆలయంలో కొలువైన అమ్మవారు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్ (చంద్రగిరి)లోని శ్రీదేవిభూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త పురందరాచార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 4:30 నిమిషాలకు మేలుకొలుపు, 5 గంటల నుంచి స్వామివారి ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం మంగళవారం ముక్కోటి ద్వాదశి సందర్భంగా స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకం, పూజ, మంగళహారతి,అ న్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు మాస్కులు ధరించి రావాలని కోరారు.

ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



వాణిశ్రీని సన్మానించిన కాలనీవాసులు

కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ ర్యాలపేట వాణిశ్రీని పట్టణానికి చెందిన గాంధీనగర్ కాలనీవాసులు శనివారం సన్మానించారు. పట్టణంలోని ఆమె ఇంటికి వెళ్లి పూలదండ, శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరిలో భక్తుల సందడి



గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బొంరాస్‌పేట: దుద్యాల మండల కేంద్ర శివారులోని కృష్ణగిరి భక్తులతో కిటకిటలాడింది. రెండోరోజైన శనివారం జాతరకు జనం భారీగా తరలివచ్చారు. శ్రీకృష్ణస్వామివారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతర వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు లంకాదహనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సరితను సన్మానించిన ఉపాధ్యాయులు

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సరితను శనివారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీఎల్ఎస్, టీఎల్ఎం మేళాలో సరిత ప్రదర్శించిన గణిత ఉపకరణాల ప్రదర్శనలో పాఠశాలకు ద్వితీయ బహుమతిని వచ్చింది. దీంతో ఉపాధ్యాయురాలిని హెచ్ఎం మల్లికార్జున్, ఎస్ఎంసీ చైర్మన్ వాణిశ్రీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మోహన్, నర్సింహారావు, నర్సింహులు ఆమెకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

పీఆర్టీయూ అభ్యర్థిని గెలిపించండి

మొయినాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చందానగర్, రెడ్డిపల్లి, మేడిపల్లి తదితర పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు నరేందర్, లక్ష్మణ్, వేణుగోపాల్, నారాయణగౌడ్, దశరథ, నర్సింహారావు, అంబీర్‌దాస్, అనంతరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

శంకర్‌పల్లి: ఆలయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ యువజన విభాగం మున్సిపల్ అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేయించి మట్టిని పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయం అభివృద్ధికి నిరంతరం సహకరిస్తానన్నారు.

భవితకు ‘తొలిమెట్టు’

- ప్రాథమిక విద్య బలోపేతమే ధ్యేయం
- కనీస అభ్యసన సామర్థ్యమే లక్ష్యం
- ఐదు రోజుల బోధన.. ఒకరోజు మూల్యాంకనం
- ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



శివారెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిఖిల (ఫైల్)

దోమ: పాఠశాల స్థాయిలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల సామర్థ్యం పెంచడానికి గతంలో పలు కార్యక్రమాలను అమలు చేసింది. 2017లో త్రీఆర్స్, 2018లో ఏబీసీ పేరుతో విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేసింది. పర్యవేక్షణ లోపం, సమీక్షలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. అనంతరం రెండేళ్ల పాటు కరోనాతో విద్యావ్యవస్థ నిర్వీర్యమైంది. దీంతో మళ్లీ ప్రాథమిక విద్య బలోపేతం దిశగా ఆగస్టు 15 నుంచి తొలిమెట్టు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇది విద్యార్థుల భవితకు ఎంతో దోహదపడనుంది. జిల్లాలోని పాఠశాలలో ఐదు రోజుల పాటు బోధన, ఒకరోజు మూల్యాంకనం చేపడుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు అంచనా వేస్తూ ముందుకు సాగుతోంది.

పకడ్బందీగా అమలు

◆ ప్రాథమిక తరగతుల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రణాళికబద్ధంగా బోధనాభ్యసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 767 ప్రైమరీ పాఠశాలలు, 116 యూపీఎస్ పాఠశాలలు ఉండగా, అందులో 55,981 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండటంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

వివిధ స్థాయిలో సమీక్ష

◆ వారంలో ఆరు పనిదినాల్లో ఐదు రోజులు విద్యార్థుల బోధన, ఒకరోజు మూల్యాంకనంతో సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. వారానికి ఓసారి మూల్యాంకనంతో పాటు ప్రతీ నెలకోసారి పరీక్ష నిర్వహించి, వారి ప్రగతిని రిజిస్టర్‌లలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ నెలా 27వ తేదీన పాఠశాలలో తొలిమెట్టు అమలు, అభ్యసనా ఫలితాల సాధనలో విద్యార్థుల ప్రగతిని సమీక్షించాల్సి ఉంటుంది. 28న మండల, 29న జిల్లా స్థాయిలో సమీక్షలు జరగనున్నాయి. కాగా క్షేత్రస్థాయిలో దీన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు మండలానికి ఓ నోడల్ అధికారిని నియమించారు. డీఈఓ, ఎంఈఓలు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను సందర్శించి తొలిమెట్టు అమలును ఉన్నతాధికారులకు తెలుసుకునేందుకు ఓ యాప్‌ను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. పాఠశాలల పర్యవేక్షణకు వెళ్లిన నోడల్ అధికారులు తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల పరీక్షలను, వారి సామర్థ్యాలను ఈ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. గతం కంటే ప్రస్తుతం తొలిమెట్టులో విద్యార్థులకు అర్థవంతమైన బోధన జరుగుతుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో తొలిమెట్టు కార్యక్రమం ఆయా పాఠశాలల్లో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు ఐదు రోజుల పాటు బోధన చేపట్టి, ఒకరోజు మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. వీటి ఆధారంగా ప్రణాళికబద్ధంగా బోధన వ్యూహాలను రూపొందించి తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.

– పురందాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, దోమ

సామర్థ్యాల పెంపునకు కృషి



గతంలో త్రీఆర్స్, ఏబీసీ పేరుతో విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసింది. ప్రస్తుతం తొలిమెట్టు కార్యక్రమం తీసుకురావడంతో క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థుల్లో మరింత మార్పు మొదలైంది. ఉన్నతమైన లక్ష్యాలను చేరుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. విద్యార్థులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

– హరిలాల్, కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, బొంపల్లి

సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి



ఉపాధ్యాయుల ఆలోచన విధానం, అన్వేషణ, పోటీతత్వంతో తొలిమెట్టు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. విద్యార్థులకు అర్థవంతమైన బోధనను అందిస్తుండటంతో సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. చిన్నారులకు విషయ పరిజ్ఞానం అలవాటు పడి, చదివిన పాఠ్యాంశాలపై పట్టు సాధించడానికి ఎంతో వీలు కలుగుతోంది. కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో తొలిమెట్టు కార్యక్రమం ముందుకు సాగుతోంది.

– హరిశ్చందర్, ఎంఈఓ, దోమ

పేదలకు అండగా ఉంటాం

ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

కుల్కచర్ల: గ్రామాలలోని పేదలకు నిరంతరం అండగా ఉంటామని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని చెరువుముందలి తండాకు చెందిన లక్ష్మమ్మ అనే మహిళా అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాము అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రవిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన జహంగీర్ ఆకస్మికంగా మృతిచెందారు. కాగా విషయం తెలుసుకొన్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి స్థానిక నేతలతో తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 వేలను అందించారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్, నాయకులు కటికె నర్సింహులు, సంతోష్, కర్ణయ్య, రుక్కు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులకోసారి నీటి సరఫరా

అనంతగిరి: గౌరీదేవిపల్లి గుట్ట మీద గల పంప్‌కు వనపర్తి లైన్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో ఈనెల 1 నుంచి 10 వరకు 10 రోజుల పాటు వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల గ్రామాలకు, మున్సిపాలిటీలకు మంచినీటి సరఫరా రోజు విడిచి రోజు ఉంటుందని (రెండు రోజులకు ఒకసారి) మిషన్ భగీరథ గ్రిడ్ విభాగం ఈఈ చల్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు మంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన పెంటారెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శనివారం ఆయన నివాసంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతూ అర్హులకు అందిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. దోమ మండల వైస్ ఎంపీపీ మల్లేశం, బీఆర్ఎస్ నేతలు శశిధర్‌రెడ్డి, రఫీక్, షఫీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మనఊరు మనబడి కార్యక్రమాన్ని తీసుకొచ్చి పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపీపీ కరణం అరవింద్‌రావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్, ఉపాధ్యాయ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు



చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

పూడూరు: పోలీస్ నియామకాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని నాయకులను అరెస్టు చేశారు. శనివారం ఉదయం మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు.

ప్రయాణికులారా జరభద్రం



బుద్దారం వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

పెద్దేముల్: తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారి అయిన మండలంలోని బుద్దారం వంతెనపై చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వంతెనపై ప్రయాణిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వంతెనపై తేలిన ఇనుపచువ్వలు విరిగిపోవడం.. ఇనుప ముక్కలు నిటారుగా నిలువడంతో ప్రమాదంగా మారింది. ఈ రహదారిపై ప్రతి నిత్యం జహీరాబాద్, వికారాబాద్, సంగారెడ్డితో పాటు సుమారు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాస్త గమనించి ప్రయాణం చేయాలని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. వంతెనపై చువ్వలు తేలడంతో అక్కడ వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా రాళ్లు పెట్టారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. గతేడాది క్రితం బుద్దారం వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు నాసిరకంగా ఉండటంతో పనులు చేసిన మూన్నాళ్లకే రాళ్లు తేలాయని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వివిధ గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్వయంపాలన



స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థినులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉత్సాహంగా స్వయం పరిపాలనా దినోత్సవం జరుపుకొన్నారు. పలువురు విద్యార్థినులు టీచర్లుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ చాటిన బి.అంబిక, జ్యోతి, కె.లావణ్య, జి.సంగీత, వి.సిరి, డి.శిరీషకు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, ఉపాధ్యాయ సిబ్బంది బహుమతులు అందజేశారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



బషీరాబాద్: అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న మాలధారులు

బంట్వారం/బషీరాబాద్: కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామమంతా మారుమోగింది. మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి మహా పడిపూజకు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మహాపడి పూజ నిర్వాహకులు నరేశ్‌స్వామి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అలాగే బషీరాబాద్ మండలం ఎక్మాయిలో పదునెట్టాంబడి ఆశ్రమంలో శనివారం అయ్యప్ప పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి అంబప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మహాపడిపూజకు అయ్యప్ప మాలధారులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ ఆశ్రమం గురుస్వాములు సాయిలుగౌడ్, నారాయణ, స్వాములు శ్రావణ్‌కుమార్, రఘుసుత్రవే, సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నరేశ్‌పై పీడీ కేసు నమోదు చేయాలి

- అయ్యప్ప మాలధారుల డిమాండ్
- జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన



పరిగిలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న అయ్యప్ప మాలధారులు తదితరులు

పరిగి: హిందూ దేవుళ్లను కించపరుస్తూ మాట్లాడిన వారిపై ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్ప మాలధారులు డిమాండ్ చేశారు. అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై తప్పక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం హైదారాబాద్, బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నాస్తికులమని చెప్పుకుంటూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. నిండు సభలో హిందువులను కించపరుస్తూ ఇష్టానుసారంగా అసభ్యకర పదజాలంతో మాట్లాడం ఎంత వరకు సమంజసనీయమన్నారు. హిందు దేవుళ్లనే టార్గెట్‌గా చేసుకొని ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే చూసుకుంటూ ఊరుకునేది లేదన్నారు. అయ్యప్ప మాలధారణ చేసే భక్తుల గురించి అపహేళనగా మాట్లాడిన నరేశ్‌పై పీడీ యాక్టు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెంటయ్య, అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

పెద్దేముల్: హిందూ ఆరాధ్య దైవం అయినటువంటి అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ శనివారం మండల పరిధిలోని హన్మాపూర్, గోట్లపల్లి గ్రామాల చత్రపతి శివాజీ యువసేన సంఘం ఆధ్వర్యంలో తాండూరు– జహీరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. బైరి నరేశ్ అనే వ్యక్తి అయ్యప్ప జననంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు న్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో చత్రపతి యువసేన అధ్యక్షుడు శ్రీనివాస్, హన్మాపూర్ మాజీ సర్పంచ్ లొంక నర్సింహులు, గొట్లపల్లి మాజీ సర్పంచ్ చంద్రప్ప, పూజారి మల్లప్ప, నేతలు నర్సప్ప, సాయిలు, రాంరెడ్డి, అనిల్‌రెడ్డి, బంగారి నవీన్, రవికుమార్, బాల్‌రాజ్, జనార్దన్, సోమనాథ్‌రెడ్డి, రమేశ్, వెంకట్, శేఖర్, నర్సింహులు, రవి, దస్తప్ప, రాములు, రమేశ్, వెంకట్, భాను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఫిర్యాదు

తాండూరు: హిందువుల ఆరాధ్యదైవమైన బైరి నరేశ్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీం (అప్పు) ఆధ్వర్యంలో అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేశ్‌పై చర్యలు తీసుకోవాలంటూ అయ్యప్ప మాలధారులు, భక్తులతో కలిసి మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం వర్గాలకు చెందిన నాయకులు తాండూరు డీఎస్పీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు విజయాదేవి, సంగీతాఠాగూర్, మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్, శ్రీనివాస్, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, హరిహరగౌడ్, బంటారం సుధాకర్, కుంచం మురళీధర్, సంతోష్‌గౌడ్, ఎర్రం శ్రీధర్, దేవాలయ కమిటీ చైర్మన్‌లు తదితరులున్నారు.

దిష్టిబొమ్మ దహనం

దోమ: హిందూ మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన బైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో హిందూ సంఘాల నేతలు బైరి నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బైరి నరేశ్‌ను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



పెద్దేముల్: తాండూరు-జహీరాబాద్ రహదారిపై గొట్లపల్లి గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న యువకులు, గ్రామస్తులు



తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నాయకులు



దోమ: దొంగ ఎన్కేపల్లిలో బైరి నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందూ సంఘాల నేతలు

ఏఎంసీ మార్కెట్‌కు 208 బస్తాల కందులు రాక



ధారూరు ఏఎంసీ మార్కెట్‌కు వచ్చిన కందులు, వడ్ల బస్తాలు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు కందుల రాక శనివారం ప్రారంభమైంది. మార్కెట్‌కు 208 బస్తాలు రాగా బీట్లలో క్వింటాల్‌కు ధర రూ. 7,060 నుంచి రూ. 7,350 వరకు కొనుగోళ్లు జరిగాయి. అలాగే సన్నరకం వడ్లు 386 బస్తాలు రాగా క్వింటాల్‌కు రూ. 2,300 నుంచి రూ. 2,420 వరకు కొనుగోలుదారులు ఖరీదు చేశారు. దొడ్డు రకం వడ్ల 360 బస్తాలు రాగా క్వింటాల్‌కు రూ. 1,800 నుంచి రూ. 1,960 వరకు అమ్మకాలు జరిగినట్లు ఏఎంసీ చైర్మన్ సంతోష్‌కుమార్ తెలిపారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

చేవెళ్ల: యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకునేందుకు టోర్నమెంట్‌లు ఉపయోగపడుతాయని చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తండ్రి పైండ్ల గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో జనవరి 2నుంచి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు చెప్పా రు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన యువ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చునని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.60వేలు, రెండో బహుమతిగా రూ.30వేలు అందజేస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఎంట్రీ ఫీజు రూ.2500 ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల జట్లు తమ పేర్లు నిర్వాహకుల వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని క్రీడాకారులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు.